## క్లుప్తంగా

### అంగన్‌వాడీ భవన నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ రాంబాబు

పద్మనాభం : మండలంలని విలాస్కాన్‌పాలెం పంచాయతీ తిమ్మాపురంలో నాడు -నేడు నిధులు రూ.16 లక్షలతో అంగన్‌వాడీ భవనం నిర్మాణానికి సోమవారం ఎంపీపీ కంటుబోతు రాంబాబు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రూ.13.50 లక్షలతో అంగన్‌వాడీ భవనం నిర్మించనున్నట్టు తెలిపారు. భవన నిర్మాణాన్ని త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నల్లి సత్యవతి, వైఎస్సార్ సీపీ నాయకులు బోని సన్యాసినాయుడు, జీవీకేకే వర్మ, సుంకర పైడి నాయుడు, ఏఈ సన్యాసయ్య పాల్గొన్నారు.

### గీతంలో 'పాట్' శిక్షణ

కొమ్మాది : ఉత్తరాంధ్ర జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో బాలికల అభ్యున్నతి కోసం ఫైజర్ హెల్త్‌కేర్ ఇండియా లిమిటెడ్ సంస్థ గీతంతో కలిసి నిర్వహిస్తున్న ఫైజర్ అటానమస్ టీమ్స్ (పాట్) శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం వీసీ ప్రొఫెసర్ దయానంద సిద్దవట్టం ప్రారంభించారు. ఫార్మసీ రంగంలోకి మహిళలను ప్రోత్సహించడానికి ఈ సంస్థ ప్రత్యేక శ్రద్ధ తీసుకుందని, అందులో భాగంగా ఈ ఏడాది 120 మంది విద్యార్థులను స్థానిక గ్రామాలకు వెళ్లి స్వయంగా ఎంపిక చేసుకుని ఉద్యోగంతో పాటు గీతం ద్వారా మూడేళ్ల డిగ్రీ కోర్సులో ఈ ఉచిత శిక్షణ అందివ్వనున్నట్లు తెలిపారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



కొండలరావు (ఫైల్)

పద్మనాభం: మండలంలోని విజయానందపురంలో జంక్షన్‌లో మోటార్ బైక్ ఢీకొని గాయపడిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్టు ఏఎస్ఐ నక్కా శ్రీనివాసరావు తెలిపారు. ఏఎస్ఐ అందించిన వివరాలిలా ఉన్నాయి. విజయానందపురం గ్రామానికి చెందిన జక్కపు కొండలరావు (51) గత నెల 31వ తేదీన మల విసర్జన కోసం రోడ్డు దాటుతుండగా విజయగనరం జిల్లా జామి మండలం భీమసింగికి చెందిన దనియాల అజయ్ మోటార్ బైక్‌తో కొండలరావును ఢీకొట్టాడు. ఈ సంఘటనలో కొండలరావుకు తలకు గాయాలయ్యాయి. చికిత్స కోసం విజయనగరం మహారాజా ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్టు ఏఎస్ఐ తెలిపారు.

### పెన్షన్ల పంపిణీ

మధురవాడ: జీవీఎంసీ మధురవాడ జోన్-2 జీవీఎంసీ 5వ వార్డుల్లోని పలు ప్రాంతాలలో పలువురు కొత్తగా మంజూరైన పెన్షన్లు పంపిణీ చేశారు. వైఎస్సార్‌కాలనీలో మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు లబ్ధిదారులకు రూ2,750 చొప్పున పెన్షన్లు అందజేశారు.

### వీధిలైట్లు ఏర్పాటు చేయండి

మధురవాడ: పోర్టు కాలనీ ద్రోణంరాజు కళ్యాణ మండపం పరిసర ప్రాంతాలలో సక్రమంగా వీధిలైట్లు లేక ఇబ్బందులు పడుతున్నట్టు కాలనీకి చెందిన జి. రాజేశ్వరరావు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం మధురవాడ జోనల్ కార్యాలయంలో జెడ్సీ రాము ఆధ్వర్యంలో నిర్వహించిన స్పందనలో ఫిర్యాదు ఇచ్చారు.

### రామాలయ వార్షికోత్సవానికి ఏర్పాట్లు

పద్మనాభం: మండలంలోని కృష్ణాపురం రెల్లి కాలనీలోని రామాలయ ద్వితీయ వార్షికోత్సవం రెండు రోజులు జరుగుతుందని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. మంగళవారం రాత్రి భజన, బుధవారం హోమాలు జరుగుతాయన్నారు.

### పీవీ చలపతిరావుకు నివాళి

తగరపువలస: బీజేపీ సీనియర్ నాయకుడు పీవీ చలపతిరావు మృతిపై ఆ పార్టీ జీవీఎంసీ 1,2 వార్డుల అధ్యక్షురాలు శీరపు రామలక్ష్మి ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. పార్టీ అభివృద్ధికి ఆయన చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు.



# ఇల..వైకుంఠపురంలో..



ఉత్తర ద్వార దర్శనానికి క్యూకట్టిన భక్తులు



భక్తులకు దర్శనమిచ్చిన శ్రీదేవి భూదేవి సమేత రంగ నాథస్వామి



శ్రీదేవి భూదేవి సమేత రంగ నాథస్వామి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఊరేగిస్తున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి

ఆనందపురం : మండలంలోని గంభీరంలోని శ్రీ శరణ్య వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం చేసుకోవడానికి భక్తులు పోటెత్తారు. ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని ఆలయ ధర్మకర్త పైడా కృష్ణ ప్రసాద్ భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. తెల్లవారు జామున 5 గంటలు నుంచి మధ్యాహ్నం 1-30 గంటలు వరకు శ్రీశరణ్య వేంకటేశ్వర స్వామి సంపూర్ణ స్వర్ణ కవచంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్ప స్వామి వారి విశ్వరూపంలో ఉత్తర ద్వార ద్వారా భక్తులకు దర్శనమిచ్చారు. వందలాది మంది భక్తులు వేకువ జామునే ఆలయానికి చేరుకోవడంతో ఆలయం కిటకిటలాడింది. దర్శనం చేసుకున్న భక్తులకు ఆలయ నిర్వాహకులు ఆరు రకాల ప్రసాదాలను అందజేశారు.

**అష్టలక్ష్మి ఆలయంలో..**

కొమ్మాది: స్థానిక అన్నంరాజునగర్ శ్రీ అష్టలక్ష్మి ఆలయంలో సోమవారం వైకుంఠ ఏకాదశి పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. వేకువ జామునే 4 గంటలకు మంగళవాయిద్యాలతో పూలంగిసేవతో శ్రీ లక్ష్మీ నారాయణులను అత్యంత సుందరంగా అలంకరించి ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు దర్శనం కల్పించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి శ్రీధర స్వామి తెలిపారు. అదే విధంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా ఆలయ ధర్మకర్తలు అన్నంరాజు సత్యనారాయణ, రమాదేవి దంపతులు పర్యవేక్షించారు.

**కుంతీ మాధవ స్వామి ఆలయంలో..**

పద్మనాభం: పద్మనాభంలో అనంత పద్మనాభ స్వామి గిరి దిగువన ఉన్న కుంతీ మాధవ స్వామి ఆలయంలో సోమవారం వైకుంఠ ఏకాదశి వేడుకలు వైభవంగా జరిగాయి. ముందుగా స్వామిని 3.30 గంటలకు సుప్రభాత సేవతో మెల్కొలిపారు. నాలుగు గంటలకు పంచామృత అభిషేకాలు నిర్వహించారు. తదుపరి గోదాదేవి అష్టదిక్పాలకు ఆవాహనం పలికారు. తరవాత శ్రీదేవి భూదేవి సమేత వేణుగోపాల స్వామి విగ్రహాలను పల్లకీలో ఊరేగించారు. అనంతరం ఆరు గంటలకు భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పిం ంచారు. ఈ సందర్భంగా శ్రీదేవి భూదేవి సమేత రంగ నాద స్వామి విగ్రహాలు, కుంతీ మాధవ స్వామి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శన మిచ్చారు. ఉత్వర దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఎంపీపీపీ కంటుబోతు రాంబాబు, పద్మనాభం సర్పంచ్ తాలాడ పాప, కృష్ణాపురం ఎంపీటీసీ సభ్యురాలు కంటుబోతు లక్ష్మి, తాలాడ పద్మనాభం, మొకర అప్పలనాయుడు, మొకర సన్నిబాబు దర్శించుకుని పూజలు చేశారు.

**వైకుంఠవాసుడికి వాన జల్లుతో అభిషేకం**

తగరపువలస : ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు దర్శనభాగ్యం కల్పించిన వైకుంఠవాసికి వాన జల్లులు స్వాగతం పలికాయి. వైకుంఠ ఏకాదశి సందర్భంగా సోమవారం ఉదయం అకస్మాత్తుగా మొదలైన వర్షపు జల్లులు మధ్యాహ్నం 12 వరకు భక్తులను పులకింపజేశాయి. వర్షంలోనే తడుచుకుంటూ భక్తులు వెంకటేశ్వరమెట్టపై శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుని, సత్యనారాయణకొండపై శ్రీరమా సత్యనారాయణస్వాములను ఉత్తర ద్వారం గుండా దర్శనాలు చేసుకున్నారు. ఓం నమోవెంకటేశాయ నమః అంటూ భక్తులు కనులారా స్వామిని వీక్షించి అర్చనలు చేయించారు. ప్రధానరహదారిలోని శ్రీషిర్డీ సాయిబాబా ఆలయం, స్థానిక రామాలయాలు భక్తి కోటితో నిండిపోయాయి. వైకుంఠనాథునితో పాటు ఆలయాలను ఆయా ఆలయ కమిటీ నిర్వహకులు పూలదండలు, తులసి మాలలతో అలంకరించారు. వెంకటేశ్వరమెట్టపై రాజగిరి కుసుమహార, రమా సత్యనారాయణస్వామి ఆలయంలో ఏడిద వివేకానందశర్మ ఆధ్వర్యంలో అర్చనలు జరిపించారు. దర్శనాల అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

**ఆలయాల కిటకిట**

మధురవాడ: ముక్కోటి ఏకాదశి పురస్కరించుకుని మధురవాడలోని వివిధ ప్రాంతాలలోని వైష్ణవ ఆలయాలకు భక్తులు విశేషంగా హాజరై ఉత్తర ద్వార దర్శనాలు చేసుకున్నారు.

ఇందులో భాగంగా బక్కన్నపాలెంలోని కోదండ రామాలయానికి భక్తులు విశేషంగా తరలి వచ్చారు. ధర్మకర్త, కమిటీ సభ్యులు కూడా స్వామికి పూజలు నిర్వహించారు. మధురవాడలో అష్టలక్ష్మి సమేత లక్ష్మీనారాయణ స్వామి ఆలయం, శ్రీనివాస నగర్‌లలోని వెంకటేశ్వర ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**నరసింహస్వామి ఆలయానికి భక్తుల తాకిడి**

భీమునిపట్నం: ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని సౌమ్యగిరిపై వెలసిన లక్ష్మీ నరసింహ స్వామిని ఉత్తర ద్వారంలో దర్శించుకోవడానికి భక్తులు విశేషంగా తరలి వచ్చారు. ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు ఆర్. సింగరాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే కల్యాణ వేంకటేశ్వర స్వామి, ఐశ్వర్య వెంకటేశ్వర స్వామి ఆలయాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు.



ధ్వజస్తంభం వద్ద భక్తుల పూజలు



వేంకటేశ్వర స్వామిని దర్శించుకుంటున్న భక్తులు



తగరపువలస వెంకటేశ్వరమెట్టపై అలంకరణలో మెరిసిపోతున్న శ్రీవారు

## ప్రమాదవశాత్తు బావిలో పడి లారీ డ్రైవర్ మృతి



బావి నుంచి వెలికితీసిన నరసింగరావు మృతదేహం

తగరపువలస: భీమిలి మండలం గొల్లల తాళ్లవలస పంచాయతీలోని నేలబావిలో ప్రమాదవశాత్తూ పడిపోయి మృతి చెందిన కొంగరాని నరసింగరావు మృతదేహాన్ని సోమవారం వెలికితీశారు. ప్రత్యక్షసాక్షులు తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం రాత్రి ఆవు కోసం వెళ్లిన నరసింగరావు పాడుపడిన నేలబావితో ప్రమాదవశాత్తూ పడిపోయాడు. రాత్రంతా తాళ్లవలస అగ్నిమాపక శాఖ సిబ్బంది గాలించినా నరసింగరావు ఆచూకీ లభించలేదు. వెంటనే భీమిలికి చెందిన అసోసియేషన్ పీపుల్స్ పవర్ సిబ్బంది వాసుపల్లి భాస్కర్, భాస్కర్ రవితేజ, సురేష్‌లకు సమాచారం అందించారు. వీళ్ల అగ్నిమాపక సిబ్బందితో కలిసి నీటిని తోడే ప్రయత్నం చేసినా చీకటి కావడంతో ఫలితం లేకుండా పోయింది. చివరకు సోమవారం ఉదయం గాలించగా నరసింగరావు మృతదేహం లభించింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడు నరగసింగరావు లారీడ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఇతనికి భార్య మంగ, కుమారుడు శేఖర్‌తో పాటు వివాహమైన ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భీమిలి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## పింఛన్లపై తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టండి



బంగ్లామెట్టపై పెరిగిన పెన్షన్లను పంపిణీ చేస్తున్న పీఏసీఎస్ అధ్యక్షుడు రామునాయుడు



జీరుపేటలో పెన్షన్ అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తగరపువలస: ప్రభుత్వ పెన్షన్లపై తప్పుడు ప్రచారాలు నిర్వహిస్తున్న ప్రతిపక్షాల వైఖరిని తిప్పికొట్టాలని జీవీఎంసీ భీమిలి జోన్ 1,2 వార్డుల వైఎస్సార్‌సీపీ నాయకులు లబ్ధిదారులను కోరారు. సోమవారం బొగ్గురోడ్డు, శ్రీనగర్, బాలాజీనగర్ సచివాలయాల పరిధిలో లబ్ధిదారులకు అవగాహన కలిగించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం రూ.250 వంతున పెంచుతూ ఈ నెల నుంచి రూ.2750 ఇస్తున్నారన్నారు. కొత్తగా అదనపు పెన్షన్లు ఇస్తుంటే పనిలేని ప్రతిపక్షాలు అసూయతో అబద్ధాలు ప్రచారం చేస్తున్నారన్నారు.

బొగ్గురోడ్డు సచివాలయంలో 2వ వార్డు ఇంచార్జ్ శిల్లా కరుణాకరరెడ్డి, అధ్యక్షుడు చిల్ల భాస్కర రెడ్డి, సరగడ శివాంజనేయరెడ్డి, చిల్ల అప్పలసూరి నరసయ్య, సరగడ శివారెడ్డి, ఎరుపు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

- ఒకటోవార్డు సచివాలయాలలో పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, అధ్యక్షుడు జగుపల్లి ప్రసాద్, తమ్మిన నరసింగరావు, పందిరి విజయ్, వెంపాడ వెంకట రమణ, అక్కరమాని చినబాబు తమ్మిన అశోక్, శేశెట్టి సత్యకల్యాణి, కొప్పల కృష్ణ, గిడుతూరి పూర్ణ, పిల్లా త్రినాథ్, బంక శ్రీను పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు.
- జీరుపేటలో కొత్తగా మంజూరైన దివ్యాంగ పెన్షన్‌ను లబ్ధిదారుడు డెక్కత శ్రీనుకు వెల్ఫేర్ సెక్రటరీ కల్యాణ్, వైఎస్సార్‌సీపీ నాయకులు జీరు వెంకటరెడ్డి, చిల్ల గణేష్‌రెడ్డి, జీరు వేణుగోపాల రెడ్డి అందించారు.

## శుభ్రతతో ఆరోగ్యం



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఆనందపురం : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే అందరూ ఆరోగ్యంగా ఉంటారని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కోరాడ శైలజ చెప్పారు. మండలంలోని వేములవలసలో సోమవారం కుటుంబ డాక్టర్ విధానం కార్యక్రమంలో భాగంగా ఆమె ఇంటింటికీ వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా శైలజ మాట్లాడుతూ బహిరంగ మలవిసర్జన పూర్తిగా నిర్మూలించాలని చెప్పారు. నివాస ప్రాంతాలలో వాడుక నీరు నిల్వ లేకుండా చూడాలని చెప్పారు. ఇంటింటికీ వెళ్లి రోగులను తనిఖీ చేసి ఆరోగ్య సూత్రాలను వివరించారు. గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలను సందర్శించి పిల్లలను తనిఖీ చేశారు. నులి పురుగు మందులను పిల్లలకు అందజేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పిల్లల బరువులను తూచారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కోరాడ అప్పలస్వామి నాయుడు, ఏఎన్ఎం ఉమ, సీహెచ్‌వో సూర్యకళ, హెచ్ఎం స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

## సత్యసాయి రథం పర్యటన



పద్మనాభంలో సత్య సాయి రథం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

పద్మనాభం: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం సత్య సాయి రథం పర్యటించింది. పద్మనాభం, రెడ్డిపల్లి, తునివలస, విజయానందపురం, కొయ్యపేట గ్రామాల్లో రథం పర్యటించింది. పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయం వద్ద రథాన్ని ఉదయం ఆరు గంటల నుంచి తొమ్మిది గంటల వరకు భక్తుల దర్శనం కోసం ఉంచారు. ఈ కార్యక్రమంలో సత్య సాయి ప్రతిధులు ఎం.వి.రమణ, రామసింగు సన్యాసిరావు పాల్గొన్నారు.

## డ్రోన్ సర్వేతో రైతులకు శాశ్వత భూ హక్కు



మద్దిలో డ్రోన్ సర్వే ప్రారంభిస్తున్న ఎంపీపీ రాంబాబు

పద్మనాభం: రైతులకు జగనన్న శాశ్వత భూహక్కు పత్రాలు ఇచ్చేందుకు తమ ప్రభుత్వం డ్రోన్ సర్వే నిర్వహిస్తున్నట్టు ఎంపీపీ కంటుబోతు రాంబాబు తెలిపారు. మండలంలోని మద్దిలో సోమవారం డ్రోన్ కెమేరా ద్వారా సమగ్ర భూ సర్వేను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ఎటువంటి చలానాలు కట్టకుండానే ప్రభుత్వం ఉచితంగా ఈ సర్వే చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బుగత సన్యాసమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు బుగత సత్యనారాయణ, బుగత ఎర్నాయుడు, పంచాయతీ కార్యదర్శి రఘు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాలపై అవగాహన



అంబేడ్కరు కూడలిలో రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ చిరంజీవి

తగరపువలస : భీమిలి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో సోమవారం అంబేడ్కరు కూడలిలో రోడ్డు ప్రమాదాలపై స్థానికులకు అవగాహన కలిగించారు. ఎస్ఐ చింతలపూడి చిరంజీవి ఈ సందర్భంగా గతంలో జరిగిన రోడ్డు ప్రమాదాలను ఎల్ఈడీ స్క్రీన్‌పై ప్రదర్శించారు.

వాహనదారులే కాకుండా నడిచివెళ్లేవారు సైతం ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. పుట్‌పాత్‌లు నడచివెళ్లే వారికోసం ఉద్దేశించినవని వాటిపై వ్యాపారాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇచ్చి వాటి యజమానులు నిందితులు కావద్దన్నారు. సీట్‌బెల్ట్, హెల్మెట్, పరిమిత సంఖ్యలో ప్రయాణికులు, డ్రైవింగ్ లైసెన్స్, మద్యం సేవించి వాహనం నడపడం నేరం వంటి విషయాలపై అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

## డ్రైనేజీల నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నేతలు

తగరపువలస: భీమిలి మండలం తాళ్లవలస పంచాయతీ గొల్లల తాళ్లవలస 6వ వార్డులో రూ.5 లక్షలతో నిర్మించనున్న డ్రైనేజీ నిర్మాణానికి సోమవారం భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బోని జగ్గమ్మ, ఉప సర్పంచ్ బీఎస్ఎన్ రాజు, పార్టీ అధ్యక్షుడు అక్కరమాని అప్పలనాయుడు, చిల్ల హరి, గొలగాని ఆనంద్, దంతులూరి వేణురాజు, గొలగాని సన్యాసిరావు పాల్గొన్నారు.

## రూ.50 లక్షలతో డ్రైనేజీ పనులు



నిర్మాణ పనులు పరిశీలిస్తున్న రామునాయుడు

తగరపువలస : జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటోవార్డు బంగ్లామెట్టలో రూ.50 లక్షలతో జరుగనున్న అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా సోమవారం శ్రీనగర్ కాలనీ, రాములమ్మ థియేటర్ వెనుక ప్రాంతాలలో డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు మాట్లాడుతూ తరచూ ముంపునకు గురవుతున్న శ్రీనగర్ కాలనీలో డ్రైనేజీని నిర్మించి ప్రధాన రహదారిలోని పెద్ద కాలువకు అనుసంధానం చేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటరమణ, తమ్మిన అశోక్ పాల్గొన్నారు.

### కాలువల నిర్మాణానికి వినతి

పద్మనాభం: మండలంలోని పాండ్రంగి, ఏనుగుల పాలెంలో సైడు కాలవలు నిర్మించాలని పాండ్రంగి పంచాయతీ వార్డు మెంబర్ మహంతి అప్పలరమణ సోమవారం తహసీల్దార్ ఎం.వి.ఎస్.లోకేశ్వర రావుకు వినతి పత్రం ఇచ్చారు. ఏనుగులపాలెంలో రెండు చోట్ల, పాండ్రంగిలో ఒక చోట సైడు కాలువలు అధ్వానంగా ఉన్నాయన్నారు.

## బంగారు ఆభరణాల చోరీ

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటోవార్డు బాలాజీనగర్‌లో అల్లు చక్రధర్‌రావు అనే వ్యక్తి ఇంట్లో ఈ నెల ఒకటోతేదీన నాలుగున్నర తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. గత డిసెంబర్‌ 28న బ్యాంకులో తాకట్టు పెట్టడానికి బయటకు తీసిన ఆభరణాలు తిరిగి బీరువాలో పెట్టి ఆదివారం చూడగా కనిపించలేదు. దీంతో బాధితుడు భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేయగా క్రైమ్ ఉమెన్ హెడ్ కానిస్టేబుల్ ఊడికల వరలక్ష్మి దర్యాప్తు చేపట్టారు.

## వైష్ణవ ఆలయాల్లో పూజలు



పీఎంపాలెం: ఈ ప్రాంతంలోని వైష్ణవ ఆలయాలలో సోమవారం ముక్కోటి ఏకాదశి పూజలు నిర్వహించారు. పీఎం పాలెం -బక్కన్నపాలెం రోడ్డులో ఉన్న శ్రీ వెంకటటేశ్వర స్వామి ఆలయంలో శ్రీవారు భక్తులకు దేవేరులతో ఉత్తర ద్వార దర్శనం ఇచ్చారు.

## చెప్పుల తయారీపై శిక్షణ



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

తగరపువలస: నాబార్డు సహకారంతో విద్యా ఫౌండేషన్ స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం భీమిలి మండలం మజ్జివలసలో మహిళలకు హవాయి చెప్పులు తయారీపై శిక్షణ ప్రారంభించారు. ఈ సందర్భంగా నాబార్డు జిల్లా అభివృద్ధి మేనేజర్ సుగ్గ శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధిలో భాగంగా స్వచ్ఛంధ సంస్థల సహకారంతో చేపడుతున్న శిక్షణా కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాలను మహిళలు వినియోగించుకోవాలన్నారు. సర్పంచ్ తుపాకుల ఆదిలక్ష్మి , భీమిలి వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

## బిట్స్ సహాయ ప్రొఫెసర్‌కు డాక్టరేట్



రంగారావుకు డాక్టరేట్ పత్రం అందజేస్తున్న ఏయూ వీసీ

పీఎంపాలెం: బాబా(బిట్స్) ఇంజినీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న పత్తిపాటి జయరంగారావుకు డాక్టరేట్ లభించింది. ఏయూ ఆచార్యులు ఎస్‌పాల్ పర్యవేక్షణలో సింథసీస్..మీసో పోరస్ మెటీరియల్స్ అనే అంశంపై ఆయన చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. డాక్టరేట్ పత్రాన్ని ఏయూ వీసీ ప్రసాదరెడ్డి అందజేశారు.

## కోడిపందాలు ఆడుతున్న ఆరుగురి అరెస్టు

తగరపువలస: భీమిలి మండలం తాటితూరు గోస్తనీనది వద్ద జడ్పీస్కూల్ సమీపంలో సోమవారం కోడిపందాల శిబిరంపై సీఐ కె.లక్ష్మణమూర్తి, ఎస్ఐ గంటా హరీష్ దాడి చేశారు. కోడిపందాలు ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసి నాలుగు కోడిపుంజులు, రూ.9,270 సీజ్ చేశారు.